నడిరోడ్డుపైనే పార్కింగ్

- ప్రమాదాలకు అడ్డాగా గౌతమినగర్ సెంటర్
- వారసంత రోజు ఇబ్బంది పడుతున్న పదిగ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు


గౌతమినగర్‌లో నడిరోడ్డుపై పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని కూరగాయల మార్కెట్ల అభివృద్ధికి 2018లో రూ.30లక్షలు కేటాయించారు. 39వ డివిజన్ గౌతమినగర్‌లోని వారసంతను ఆధునీకరించారు. 10గ్రామాల ప్రజలకు ప్రతి బుధవారం నిర్వహించే గౌతమినగర్ కూరగాయల మార్కెట్ ప్రధానమైంది. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తయి ముడేళ్లు గడిచినా వినియోగదారుల కోసం మార్కెట్ ప్రాంగణంలో పార్కింగ్, సామూహిక మరుగుదొడ్లు నిర్మించలేదు. మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు ద్విచక్రవాహనదారులు నడిరోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో గౌతమినగర్ నుంచి ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్ మీదుగా 10 గ్రామాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రతీ బుధవారం వారసంత..

పది గ్రామాలకు ఇదే ప్రధాన మార్కెట్. సాయంత్రం సమయంలో వివిధ కాలనీలు, గ్రామాల నుంచి కూరగాయలు కొనేందుకు రావడంతో మార్కెట్ మొత్తం రద్దీగా ఉంటుంది. మార్కెట్ జరిగే సమయంలో రోడ్డుపై అడ్డంగా వాహనాలు పార్క్ చేసి ఉండడం, మార్కెట్‌కు దగ్గరలో వైన్ షాప్ ఉండడంతో మద్యం మత్తులో మందు బాబులు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు కారణం అవుతున్నారు. అధికారులు స్పందించి వారసంతలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఖాళీ స్థలం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పార్కింగ్ స్థలంలో మొక్కలు..

కూరగాయల మార్కెట్‌లోని పార్కింగ్ స్థలంలో కార్పొరేషన్ అధికారులు హరితహారం మొక్కలు నాటడంతో పార్కింగ్ స్థలం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి పార్కింగ్ స్థలంలో నాటిన మొక్కలను తొలగించి వాహనాలు పార్కింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలి

గౌతమినగర్ వారసంత ప్రతి బుధవారం నిర్వహిస్తారు. వారసంతలో సాయంత్రం ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూరగాయలు కొనేందుకు రావడంతో సాయంత్రం సమయంలో ఎక్కువ రద్దీగా ఉంటుంది. వ్యాపారం జరిగి సమయంలో ద్విచక్ర వాహనదారులు వాహనాలను రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి వారసంత జరిగే సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

మొక్కలు తొలగించాలి



మార్కెట్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో కార్పొరేషన్ అధికారులు మొక్కలు నాటారు. దీంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి మొక్కలు తొలగించి ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేలా సౌకర్యం కల్పించాలి.

– కల్వాల సంతోష్, శాంతినగర్

తరచూ ప్రమాదాలు



గౌతమినగర్ వారసంతలో బైక్‌లు పార్కింగ్ చేసేందుకు అధికారులు స్థలం కేటాయించలేదు. దీంతో వినియోగదారులు ప్రధాన చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– సూజత, గృహిణి

ఓటు వినియోగంపై కళాజాత ప్రదర్శన


గోలివాడలో కళాజాత ప్రదర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ, విలేజి అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం, పెద్దంపేట గ్రామాల్లో మంగళవారం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (ఎస్‌వీఈఈపీ) ద్వారా ఓటుహక్కు వినియోగం ప్రాధాన్యతను కళాజాత బృందం సాంస్కృతిక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం కల్పించిన తమ ఓటుహక్కును వినియోగించుకొని స్వచ్ఛమైన ప్రజాప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, సాంస్కృతిక కళాకారులు కోండ్ల వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశంగౌడ్, గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్‌గౌడ్, నారగోని సరితగౌడ్, సలేంద్ర రాజన్న యాదవ్, సాయిల్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



రహదారిపై నిలుస్తున్న వరద నీరు

రామగుండం: రాజీవ్ రహదారి ఎన్టీపీసీ కూలింగ్ టవర్ల ఎదుట మల్యాలపల్లి రైల్వేట్రాక్ వద్ద వరద నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. అదే ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. దీనిపై సంబంధిత హెచ్‌కేఆర్ ప్రతినిధులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వాకర్స్‌కు ఉచితంగా షుగర్ పరీక్షలు


పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖని పీజీ కాలేజీ ఆవరణలో మంగళవారం ఉదయం రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 100 మందికిపైగా వాకర్స్‌కు ఉచితంగా షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డయాబెటిక్ రాకుండా రోజువారీ తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తానిపర్తి విజయలక్ష్మి, బంక కళావతితోపాటు క్లబ్ సీనియర్ ప్రతినిధులు బంక రామస్వామి, తానిపర్తి గోపాల్‌రావు, తిలక్ చక్రవర్తి, టెక్నీషియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ రామగుండం అధ్యక్షుడిగా విజయ్‌కుమార్



గోదావరిఖని: ఎన్ఎస్‌యూఐ రామగుండం అధ్యక్షుడిగా దాసరి విజయ్‌కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌కు విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సోషలిస్ట్ రాజ్యస్థాపనే ధ్యేయంగా పనిచేయాలి


మాట్లాడుతున్న భిక్షపతి

జ్యోతినగర్: పెట్టుబడీ సమాజాన్ని కూల్చి సోషలిస్ట్ రాజ్యస్థాపనే ధ్యేయంగా పనిచేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్.భిక్షపతి అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండంలోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం, కార్మిక రాజ్యస్థాపన ప్రపంచాన్నే కుదిపేసిందన్నారు. దోపిడీ రహిత సమాజం కమ్యూనిస్టు రాజ్యంలోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి రామాచారి, నాయకులు రమణ, భాగ్య, సాయి మాధవి, గీతాంజలి, స్వప్న, సతీశ్, పుష్ప, సరిత, నర్మద, సరిత తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక విద్యార్థుల తిప్పలు

జూలపల్లి: రాజకీయ పార్టీల సమావేశాలకు, బహిరంగ సభలకు ఆర్టీసీ సంస్థ బస్సులు ఇవ్వడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ టీపీ మండల అధ్యక్షుడు కొమ్మ రాజయ్యయాదవ్ అన్నారు. జూలపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలకు ప్రభుత్వం బస్సులు కేటాయించగా గ్రామాల నుంచి విద్యార్థులు చదువుకునేందుకు వెళ్తున్నారు. గ్రామాలకు నడిపించే బస్సులను కేటాయించడంతో విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. బహిరంగ సభలకు బస్సులు పంపించడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారని, విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న జగన్‌మోహన్‌రావు

ముత్తారం: మండలంలోని పారుపల్లికి చెందిన సంకిర్తుల విష్ణు అనే యువకుడు ఇటీవల మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యులను మంగళవారం ముత్తారం మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ కాంగ్రెస్ నాయకుడు నాగినేని జగన్‌మోహన్‌రావు పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని సంతాపం వ్యక్తం చేశారు. అలాగే శాలగుండ్లపల్లిలో ఇటీవల పలువురు మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. నాయకులు బుచ్చాంరావు, ఎడవేని సంపత్, చొప్పరి సంపత్, బోడ రత్నాకర్, ఇనుముల ప్రదీప్, పీక శంకర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

జూలపల్లి: రైతులు తాము పండించిన ధాన్యానికి మద్దతు ధర పొందేందుకు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పత్తిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో బుచ్చయ్య సూచించారు. మండలంలోని అబ్బాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యానికి మద్దతు ధర రావాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో, మాజీ సీఈవో రాజయ్య, రైతులు గొడిసెల ధర్మయ్య, బొమ్మెనవని కొమురయ్య, అంజయ్య, కనుకం జల్పతి, కొమ్మకొమురయ్య, రాజేశం ఉన్నారు.


జూలపల్లి: అబ్బాపూర్‌లో..

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

కమాన్‌పూర్: మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. గుండారం, గొల్లపల్లె, రొంపికుంట, నాగారం, పేంచికల్‌పేట, సిద్దిపల్లె గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పీఏసీఎస్ సీఈవో తిమ్మరాజు సంతోష్‌కుమార్ ప్రారంభించారు. రైతులు వరికోత కోసి ధాన్యం తేమశాతం లేకుండా తీసుకుచ్చి ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో సంతోష్‌కుమార్



ధాన్యం నేరుగా రైస్‌మిల్లుకే..

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధి పూసాలలోని ఓ రైస్‌మిల్‌కు రైతులు ధాన్యాన్ని నేరుగా తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో సుల్తానాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు నేరుగా రైస్‌మిల్లులకు తీసుకొచ్చి అమ్ముతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద మాయిశ్చర్ పేరుతో 10 నుంచి 15 రోజుల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో రైతులు రైస్‌మిల్లుల్లో అమ్మేందుకే మొగ్గుతున్నారు. క్వింటాల్‌కు మద్దతు ధర కంటే రూ.100 అధికంగా ఇస్తుండడంతో అమ్ముతున్నట్లు పలువురు రైతులు తెలుపుతున్నారు. రైతులు నేరుగా అమ్ముకోవచ్చని అధికారులు చెప్తుండడంతో అమ్మకాలు జోరుందుకున్నాయి.

బోరు మోటారు.. బాగు చేయించరూ!



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో తాగునీరు సరఫరా చేసే బోరుమోటారు కొన్నిరోజుల క్రితం కాలిపోయింది. దీంతో పల్లెవాసులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌తో నీరు సరఫరా చేస్తున్నప్పటికీ సరిపోవడం లేదని పల్లెవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలిపోయిన బోరుమోటార్‌కు మరమ్మతు చేయించి తాగునీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

కాల్వశ్రీరాంపూర్: ఎస్సీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 11న నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ అంబాల రాజేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం 'చలో హైదరాబాద్' విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు నిర్వహిస్తున్న విశ్వరూప మహాసభకు పీఎం మోడీ ముఖ్య అతిథిగా రానుండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జిల్లాలోని మాదిగ, ఉపకులాలు అధిక సంఖ్యలో తరలి రావాలని రాజేందర్ కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పుల్లూరి సాగర్, నాయకులు దంతెనపెల్లి ధర్మయ్య, శ్రీనివాస్ రమేశ్, రవీందర్, సురేందర్, సృజందర్, లక్ష్మి, రవళి, రమ్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అనారోగ్యంతో ఆర్ఎంపీ మృతి

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ మండల అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు బొద్దు నారాయణ (50) అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కాగా మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తరలించారు. సమాచారం అందుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం ఉదయం మేడారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో మంత్రి పాల్గొన్నారు. అంతిమయాత్రలో ధర్మారం, వెల్గటూర్ మండలాలకు చెందిన ఆర్ఎంపీలు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ నుంచి ఓదెలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఇండేన్ గ్యాస్ గోదాం సమీపంలో విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు వంగి ఉన్నాయి. గాలి దుమారం వీస్తే స్తంభాలు విరిగి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాలను సరి చేయాలని అన్నదాలు కోరుతున్నారు.



ప్రకృతికి పక్షుల తోరణం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ నీలకంఠం చెరువులో పక్షుల కిలకిల రావాలు ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదపరుస్తున్నాయి. చెరువులో నుంచి వేసిన కరెంట్ స్తంభాల తీగలపై వరుసగా వాలిన పక్షులు ప్రకృతికి తోరణం కట్టినట్లు ఉందంటున్నారు స్థానికులు. కొందరు పక్షుల సందడిని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్నారు. మరి కొందరు సెల్ఫీ దిగుతున్నారు.

దళితుల భూములు లాక్కోవడం సరికాదు


భూములను పరిశీలిస్తున్న నాయకులు

రామగిరి: మండలంలోని లొంకకేసారం గ్రామంలో దళితుల భూములను లాక్కోవడం సరికాదని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం గ్రామంలోని చెరువు శిఖం భూములను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువు శిఖం భూములు దళితులు దున్నుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపినా.. నిబంధనలకు వ్యతిరేకంగా అభివృద్ధి పేరిట క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారని ఆరోపించారు. అభివృద్ధి పేరిట దళితుల భూములను లాక్కోవడం సరికాదని సర్పంచ్, పాలకవర్గం స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్, నాయకులు ఆర్ల సందీప్, ఏల్పుల సురేశ్, బావు రవి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : నరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com